www.siridaily.com
RNI TG TEL/ 26/A0381
సిరి
People's Voice వార్తపత్రిక
సోమవారం
18-05-2026
సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 134
MEDAK, SANGAREDDY, SIDDIPET
పేజీలు : 4

## విద్యతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటిన స్మితిక



2

### కానుకుంట విద్యార్థినికి జిల్లా స్థాయి సన్మానం

- క్రీడలు – విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి రూ.10 వేల నగదు బహుమతి
- తల్లిదండ్రులకు కూడా ఘన సత్కారం



# కొల్లూర్ లక్ష్మీపురం
# ప్లాట్స్ వివాదం

- రెండు వర్గాల మధ్య ఉద్రిక్తత
- "మీ వర్గం వాళ్లు అమ్ముడు పోయారు".. అంటూ పరస్పర ఆరోపణలు
- సుప్రీం కోర్ట్ స్టేటస్‌కో అంశంపై వాగ్వాదం
- పోలీసుల తీరుపై అసంతృప్తి
- ప్రెస్‌మీట్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు

4

తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొల్లూర్ లక్ష్మీపురం ప్లాట్స్ వివాదం ఆదివారం ఉద్రిక్తతకు దారితీసింది. ఒక వర్గానికి చెందిన వారు మీడియా సమావేశం ఏర్పాటు చేయగా, మరో వర్గానికి చెందిన వ్యక్తులు అక్కడికి చేరుకుని అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. "ఈ స్థలంపై సుప్రీం కోర్ట్ స్టేటస్‌కో ఉంది.. అలాంటి సమయంలో మీరు ఇక్కడికి ఎలా వస్తారు?" అంటూ ఒక వర్గం ప్రశ్నించగా, "మేము కూడా ప్లాట్స్ యజమానులమే.. మాకు కూడా హక్కు ఉంది" అంటూ మరో వర్గం స్పందించింది. ఈ సందర్భంగా "మీ వర్గం వాళ్లు అమ్ముడు పోయారు.. అందుకే కబ్జాలు జరుగుతున్నాయి" అంటూ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు.

రామచంద్రపురం, (సిరి న్యూస్)



## ఉల్లాస్ వాలంటరీ కొమ్ము స్వాతికి జిల్లా స్థాయి పురస్కారం

నిరక్షరాస్య మహిళల్లో విద్యా చైతన్యం నింపిన సేవలకు గుర్తింపు

జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా శాలువాతో ఘన సన్మానం



2





3

## పచ్చని పంటల నేలపై
# పారిశ్రామిక నీడ

**నల్లవల్లి రైతుల్లో భవిష్యత్‌పై పెరుగుతున్న ఆందోళన**

భూమి కోల్పోతే బతుకుదెరువు ఎలా అంటూ రైతుల ఆవేదన

పరిహారం వస్తుందనే ఆశతో కొందరిలో ఆనందం

రాష్ట్ర రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న గుమ్మడిదల మండల పరిధిలోని నల్లవల్లి గ్రామంలో వ్యవసాయ భూముల అంశం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తరతరాలుగా పచ్చని పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్న రైతుల్లో భవిష్యత్‌పై ఆందోళన నెలకొంది. ఒకవైపు తమ జీవనాధారమైన భూములు కోల్పోతామనే భయం రైతులను కలవరపెడుతుండగా, మరోవైపు ప్రభుత్వం ద్వారా పరిహారం అందుతుందనే ఆశతో కొందరు రైతులు సానుకూలంగా స్పందిస్తున్నారు.

గుమ్మడిదల, మే 17 (సిరి న్యూస్)



# విద్యతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటిన స్మితిక

- **క్రీడలు – విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి రూ.10 వేల నగదు బహుమతి**
- **తల్లిదండ్రులకు కూడా ఘన సత్కారం**

## కానుకుంట విద్యార్థినికి జిల్లా స్థాయి సన్మానం

**గుమ్మడిదల, మే 17 (సిరి న్యూస్ ):** గుమ్మడిదల మండల పరిధిలోని కానుకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎం. స్మితిక విద్యా, క్రీడా రంగాల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో గుర్తింపు పొందింది. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్సవాల సందర్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ చేతుల మీదుగా విద్యార్థినికి రూ.10వేల నగదు బహుమతితో పాటు ఘన సన్మానం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొని విద్యార్థినిని అభినందించారు. క్రీడలతో పాటు విద్యలోనూ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి చేరుకోవాలని గురువులను, తల్లిదండ్రులను గౌరవిస్తూ ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ సూచించారు. విద్యార్థి సాధించిన విజయానికి గుర్తింపుగా ఆమె తల్లిదండ్రులను కూడా శాలువాలతో సత్కరించడం జరిగింది. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు విజేత కుమారి ప్రోత్సాహం, మార్గదర్శకత్వంతో ఉషు క్రీడల్లో ఈ విజయాన్ని సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వీబీ నీరజ, వ్యాయామ ఉపాధ్యాయురాలు విజేత కుమారి పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని జిల్లా స్థాయిలో గుర్తింపు పొందడం పట్ల గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# ఉల్లాస్ వాలంటరీ కొమ్ము స్వాతికి జిల్లా స్థాయి పురస్కారం



## నిరక్షరాస్య మహిళల్లో విద్యా చైతన్యం నింపిన సేవలకు గుర్తింపు

## జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా శాలువాతో ఘన సన్మానం

గుమ్మడిదల మే 17 (సిరి న్యూస్ ): గుమ్మడిదల మండల పరిధిలోని అనంతారం గ్రామానికి చెందిన కొమ్ము స్వాతి విద్యా సేవలతో జిల్లా స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా 18 సంవత్సరాలు పైబడిన నిరక్షరాస్య మహిళలకు చదువుపై ఆసక్తి పెంపొందిస్తూ వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దినందుకు ఆమెను జిల్లా అధికారులు ఉత్తమ వాలంటీర్‌గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ చేతుల మీదుగా శాలువాతో ఘనంగా సన్మానించి అవార్డు ప్రదానం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువు అందని మహిళలకు విద్య యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ వారికి రాత్రి వేళల్లో కూడా ప్రత్యేకంగా బోధనలు నిర్వహించడం ద్వారా కొమ్ము స్వాతి విశేష సేవలు అందించారు. చదువు మధ్యలోనే ఆగిపోయిన మహిళలను మళ్లీ విద్య వైపు మళ్లిస్తూ అక్షరాలు తెలియని వారికి చదవడం, రాయడం నేర్పించడంతో పాటు స్వయంగా ప్రభుత్వ పథకాలలో అవగాహన కల్పిస్తూ ఆమె సేవలందిస్తున్నారు. చదువు వయస్సుతో సంబంధం లేదు నేర్చుకోవాలనే ఆసక్తి ఉంటే ప్రతి ఒక్కరూ అక్షరాస్యులవ్వగలరు అనే భావనతో గ్రామంలో మహిళల్లో విద్యా చైతన్యం తీసుకురావడంలో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు. తనకు ఉన్న విద్యను తోటి వారికి పంచుతూ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్న కొమ్ము స్వాతి సేవలను జిల్లా అధికారులు ప్రశంసించారు. గ్రామీణ మహిళల జీవితాల్లో వెలుగులు నింపే విధంగా ఆమె చేస్తున్న సేవలు ఇతర యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. అనంతారం గ్రామానికి చెందిన యువతి జిల్లా స్థాయిలో గుర్తింపు పొందడం పట్ల గ్రామ ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. కొమ్ము స్వాతి, అనంతారం గ్రామ ప్రస్తుత సర్పంచ్ కొమ్ము శ్రీనివాస్ గారి సతీమణి కావడం విశేషం.



# పచ్చని పంటల నేలపై పారిశ్రామిక నీడ

## నల్లవల్లి రైతుల్లో భవిష్యత్‌పై పెరుగుతున్న ఆందోళన

**భూమి కోల్పోతే బతుకుదెరువు ఎలా అంటూ రైతుల ఆవేదన**
**పరిహారం వస్తుందనే ఆశతో కొందరిలో ఆనందం**

**గుమ్మడిదల, మే 17 (సిరి న్యూస్): రాష్ట్ర రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న గుమ్మడిదల మండల పరిధిలోని నల్లవల్లి గ్రామంలో వ్యవసాయ భూముల అంశం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తరతరాలుగా పచ్చని పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్న రైతుల్లో భవిష్యత్‌పై ఆందోళన నెలకొంది. ఒకవైపు తమ జీవనాధారమైన భూములు కోల్పోతామనే భయం రైతులను కలవరపెడుతుండగా, మరోవైపు ప్రభుత్వం ద్వారా పరిహారం అందుతుందనే ఆశతో కొందరు రైతులు సానుకూలంగా స్పందిస్తున్నారు.**

### అభివృద్ధి కావాలి.. కానీ రైతుకు న్యాయం జరగాలి

గ్రామ ప్రజలు అభివృద్ధికి వ్యతిరేకం కాదని, కానీ రైతుల జీవనాధారాన్ని దెబ్బతీయకుండా ప్రభుత్వం ముందుకు సాగాలని కోరుతున్నారు. భూములు తీసుకునే ముందు రైతుల అభిప్రాయాలను గౌరవించి, వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అభివృద్ధి పేరుతో పచ్చని పంటల నేలలు కనుమరుగవకుండా చూడాలని, రైతుల జీవితాలు రోడ్డున పడకుండా ప్రభుత్వం మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని నల్లవల్లి గ్రామ ప్రజలు కోరుతున్నారు.

### రాష్ట్ర రాజధానికి కూరగాయల నిలయం

నల్లవల్లి గ్రామ పరిసర ప్రాంతాలు ఎన్నో ఏళ్లుగా కూరగాయల సాగుకు ప్రసిద్ధి చెందాయి. ఇక్కడ పండే తాజా కూరగాయలు రాష్ట్ర రాజధాని ప్రజల ఆహార అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ నేలను నమ్ముకొని రైతులు కుటుంబాలను పోషిస్తూ, పిల్లలకు విద్యాభ్యాసం అందిస్తూ జీవన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. ఈ భూమే మా జీవితం.. ఈ పంటే మా ఆశ అంటూ రైతులు చెబుతున్న మాటలు గ్రామంలో నెలకొన్న పరిస్థితిని స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

### కన్నీటి పర్యంతమవుతున్న రైతు కుటుంబాలు

వ్యవసాయం తప్ప మరో ఉపాధి తెలియని రైతు కుటుంబాలు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నాయి. భూమి లేకపోతే మా బతుకే చీకటిలో పడిపోతుంది అంటూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న, సన్నకారు రైతులు అయితే తమ కుటుంబాల భవిష్యత్తుపై మరింత ఆందోళన చెందుతున్నారు. కొంతమంది రైతులు కన్నీటి పర్యంతమవుతూ, ఈ నేలతో మాకు అనుబంధం ఉంది. ఇది పోతే మేము ఎక్కడికి వెళ్లాలి అంటూ ప్రశ్నిస్తున్నారు.

### కొందరిలో మాత్రం ఆశల వెలుగు

మరోవైపు కొందరు రైతులు మాత్రం ఈ పరిణామాన్ని భిన్న కోణంలో చూస్తున్నారు. అసైన్మెంట్ భూములను స్వేచ్ఛగా విక్రయించే అవకాశం లేకపోవడంతో, ప్రభుత్వం భూములు స్వాధీనం చేసుకుంటే పరిహారం రూపంలో వచ్చే నిధులతో పిల్లల చదువులు, పెళ్లిళ్లు, కుటుంబ అవసరాలు తీర్చుకోవచ్చనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా భూమిని అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నాం ప్రభుత్వం ద్వారా సరైన పరిహారం వస్తే కొంత ఊరట లభిస్తుంది అని కొందరు రైతులు మనసులో అనుకుంటున్నా మాటలు. ఏది ఏమైనా భూమి పోతే మాత్రం తిరిగి రాదన్న విషయాన్ని రైతు గ్రహించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

### 337 ఎకరాల భూములపై గజిట్

గ్రామంలోని సర్వే నంబర్ 142లో గల 126.09 ఎకరాలు, సర్వే నంబర్ 160లో గల 211.28 ఎకరాలు కలిపి మొత్తం 337.37 ఎకరాల వ్యవసాయ భూమిని తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ (టీజీఐఐసీ)కు అప్పగించాలంటూ ప్రభుత్వం గజిట్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఆ రోజు నుంచి గ్రామంలో చర్చలు, అనిశ్చితి, ఆందోళనలు మరింత పెరిగాయి.









# కొల్లూర్ లక్ష్మీపురం ప్లాట్స్ వివాదం

- రెండు వర్గాల మధ్య ఉద్రిక్తత
- “మీ వర్గం వాళ్లు అమ్ముడు పోయారు"..  అంటూ పరస్పర ఆరోపణలు
- సుప్రీం కోర్ట్ స్టేటస్‌కో అంశంపై వాగ్వాదం
- పోలీసుల తీరుపై అసంతృప్తి
- ప్రెస్‌మీట్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు

**రామచంద్రపురం, మే 17 (సిరి న్యూస్):** తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొల్లూర్ లక్ష్మీపురం ప్లాట్స్ వివాదం ఆదివారం ఉద్రిక్తతకు దారితీసింది. ఒక వర్గానికి చెందిన వారు మీడియా సమావేశం ఏర్పాటు చేయగా, మరో వర్గానికి చెందిన వ్యక్తులు అక్కడికి చేరుకుని అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. “ఈ స్థలంపై సుప్రీం కోర్ట్ స్టేటస్‌కో ఉంది.. అలాంటి సమయంలో మీరు ఇక్కడికి ఎలా వస్తారు?” అంటూ ఒక వర్గం ప్రశ్నించగా, “మేము కూడా ప్లాట్స్ యజమానులమే.. మాకు కూడా హక్కు ఉంది” అంటూ మరో వర్గం స్పందించింది. ఈ సందర్భంగా “మీ వర్గం వాళ్లు అమ్ముడు పోయారు.. అందుకే కబ్జాలు జరుగుతున్నాయి” అంటూ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. అయితే ఘటన సమయంలో పోలీసుల స్పందన తీరుపై కొందరు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. అనంతరం ఒక వర్గం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ప్లాట్ యజమానులు.. కొల్లూర్‌లోని సర్వే నంబర్లు 174, 175, 177, 180 నుంచి 183, 186 నుంచి 190 వరకు గల లక్ష్మీపురం కాలనీ లేఅవుట్‌లో దాదాపు 1300 మంది ప్లాట్లు కొనుగోలు చేశారని తెలిపారు. 1984 నుంచే తాము స్వాధీనంలో ఉన్నామని, ఇటీవల కొంతమంది తప్పుడు పత్రాలు సృష్టించి ప్లాట్లను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు మూర్తి, శ్రీకాంత్ రెడ్డి, రాకేష్, మల్లేష్, రామ్మోహన్, వెంకట్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, భాగ్యలక్ష్మి, గిరిజారాణి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, ఈ వ్యవహారంపై ఇప్పటికే న్యాయపరమైన ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో తాము కూడా చట్టపరంగానే ముందుకు వెళ్తామని ఇరు వర్గాలు స్పష్టం చేశాయి.



